## శ్రీ పరాభవనామ సంవత్సరంలో వైభవంగా ఉండాలి : కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ తూర్పు, మార్చి 18 (ప్రభాతవార్త) :** అజ్ఞానం, అహంకారం, బలహీనతలను జయించి ఉన్నత స్థితికి ఎదిగేందుకు ప్రతీక అయిన శ్రీ పరాభవనామ సంవత్సరం జిల్లా ప్రజల జీవితాల్లో కొత్త విజయాల వెలుగులు నిండాలని ఆకాంక్షిస్తూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు ప్రజల సంస్కృతిలో ఉగాది పండుగకు విశిష్ట స్థానం ఉందని, ఇది కేవలం కొత్త సంవత్సర ఆరంభం మాత్రమే కాకుండా ఆలోచనలు, ఆశయాలను పునర్నిర్మించుకునే ఒక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు జీవితంలోని సుఖదుఃఖాలను సూచిస్తాయని, కష్టాలను కూడా సానుకూల దృక్పథంతో స్వీకరించి ముందుకు సాగితేనే నిజమైన విజయం సాధ్యమవుతుందని అన్నారు. ప్రతికూల ఆలోచనలను దూరం చేసి సానుకూల దృక్పథంతో జీవించాలని, అహంకారాన్ని విడిచి వినయంతో ముందుకు సాగితే సమాజం అభివృద్ధి దిశగా ప్రయాణిస్తుందని తెలిపారు. ఈ ఉగాది ప్రతి కుటుంబంలో సుఖశాంతులు నెలకొనాలని, అందరికీ ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ ఎన్టీఆర్ జిల్లా విద్య, వ్యవసాయం, వాణిజ్యం పారిశ్రామిక, పర్యాటకం తదితర రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించి ప్రజల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేయాలని కోరుకుంటున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

## పరిశ్రమల్లో వేసవి భద్రతా తనిఖీలు

**విజయవాడ, మార్చి 18 (ప్రభాతవార్త) :** వేసవి నేపథ్యంలో పరిశ్రమల్లో చోటు చేసుకునే అగ్ని



ప్రమాదాలతో పాటు ఇతర పారిశ్రామిక ప్రమాదాలు జరక్కుండా చూడటంలో భాగంగా ప్రత్యేక పారిశ్రామిక తనిఖీ బృందాలు బుధవారం కొండపల్లి ఐడీఏలోని నిఫ్టీ ల్యాబ్స్ తదితర సంస్థల్లో తనిఖీలు నిర్వహించాయి. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పరిశ్రమల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల అధికారి (డీఐవో) ఎం.మధు తెలిపారు. పరిశ్రమలు, అగ్నిమాపక, ఫ్యాక్టరీలు, కాలుష్య నియంత్రణ మండలి, విద్యుత్, పోలీసు, కార్మిక శాఖ, బాయిలర్, రెవెన్యూ, ఏపీఐఐసీ, ఔషధ నియంత్రణ తదితర శాఖల అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఫార్మా, కెమికల్, సిమెంటు, బాణసంచా గోదాములు, ఎల్‌పీజీ బాట్లింగ్ యూనిట్లు, మధ్య, భారీ పరిశ్రమలు తదితరాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు సరిగా ఉన్నాయో లేదో చెక్‌లిస్టు ప్రకారం తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. అగ్నిమాపక పరికరాల పనితీరు, ప్రమాదకర రసాయనాల నిల్వ విధానం, విద్యుత్ వ్యవస్థల స్థితిగతులు, భద్రతా పరికరాల ధ్రువపత్రాలు, కార్మికుల భద్రత తదితరాలపై దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు కొండపల్లి ఐడీఏలోని ఇన్‌కెమ్ ల్యాబ్స్, రాణి లైఫ్ సైన్సెస్, నిఫ్టీ ల్యాబ్స్, ఆర్చ్ ల్యాబ్స్ తదితర సంస్థల్లో తనిఖీలు నిర్వహించామని, మాక్ డ్రిల్స్ కూడా చేస్తున్నట్లు పరిశ్రమల అధికారి మధు తెలిపారు

## సిపి రాజశేఖరబాబుకు సన్మానం

**విజయవాడ కార్పొరేషన్,మార్చి 18,ప్రభాతవార్త :** సిపి రాజశేఖరబాబుకు ప్రతిష్టాత్మకమైన అతి ఉత్కృష్ట సేవా పతకం-2025 వచ్చిన నేపథ్యంలో పలువురు పోలీసు అధికారులు ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటూ సమర్థవంతమైన సేవలు అందిస్తోందని, క్రమశిక్షణ,అంకితభావంతో ప్రజలకు సమర్థవంతమైన పోలీసు సేవలను అందిస్తూ



ఆయనను సన్మానించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ జిల్లా సిపి రాజశేఖరబాబు ప్రతిష్టాత్మకమైన సేవా పతకం ప్రకటించిన సందర్భంగా సిపి కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా పోలీసు అధికారులు,సిపి రాజశేఖరబాబును కలిసి బొకేలను అందించి ఆయనను దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ సిపి రాజశేఖరబాబు నాయకత్వంలో పోలీసు శాఖ విశేష ప్రతిభ కనబర్చినందుకు ఈ పురస్కారం లభించిందని అధికారులు పేర్కొన్నారు. నగరంలో శాంతి భద్రతలను కాపాడటంలో ఆయన నాయకత్వం ఎంతో కీలకమైందని అభినందించారు. కార్యక్రమంలో డిసిపిలు తిరుమలేశ్వరరెడ్డి,షిరీన్ బేగం,కెజివి సరిత,కె.కృష్ణప్రసన్న,బి.లక్ష్మీనారాయణ,ఎస్‌విడి ప్రసాద్,ఏడిసిపిలు,ఏసిపిలు,సిఐలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## అత్యవసరమైతే తప్ప ఇంటి నుండి బయటకు రావద్దు : కమీషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,మార్చి 18,ప్రభాతవార్త :** లోతట్టు,కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరూ సురక్షితమైన ప్రదేశాలకు తరలివెళ్ళాలని, అత్యవసరమైతే తప్ప ఇంటి నుండి బయటకు రావద్దని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ శాఖ,ఎన్టీఆర్ జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో లోతట్టు కొండ వాలు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళాలన్నారు. రానున్న మూడు నుండి నాలుగు గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు,కొండవాలు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలందరూ సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళాలన్నారు. సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నాక,అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇంటి నుండి యటకు రావద్దని కోరారు. నగరపాలక సంస్థ పరిధిలో గల పునరావాస కేంద్రాలన్నిటిని పూర్తి అందుబాటులో ఉంచాలని,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా నగరపాలక సంస్థ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ తగు చర్యలు తీసుకుంటారన్నారు.



## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

**తిరువూరు, మార్చి 18, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగశక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించిందని ఏపీ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్ అన్నారు. బుధవారం తిరువూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో దివ్యాంగ శక్తి పథకాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం 40 కంటే ఎక్కువ వైకల్యం కలిగిన దివ్యాంగులందరూ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించిందన్నారు. వారితో పాటు ప్రయాణించే సహాయకులు కూడా చార్జీలో 50 శాతం రాయితీతో ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేయనున్నదని దేవదత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ కె మనోజ, డిపో మేనేజర్ ఏ సుబ్రహ్మణ్యం, పలువురు ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



## గ్రీన్ ఎనర్జీ కారిడార్-3

**అమరావతి, మార్చి 18, ప్రభాతవార్త :** ఎత్తైన విద్యుత్ లైన్ల ఏర్పాటు కోసం అడవులను తొలగించడం పచ్చని రమణీయ దృశ్యాలను తీసివేయడం అందరికి భారంగా అన్పించేది. కానీ ఇప్పుడు పరిస్థితుల్లో బాగా మార్పు వచ్చింది. పర్యావరణాన్ని కాపాడుకోవాలనే అవగాహనతో ప్రతిపాదిత గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 కింద దాదాపు 11 జిడబ్లు సౌరశక్తిని మరియు 7 బిజూ పంప్డ్ నిల్వ సామర్థ్యాన్ని అనుసంధానించే ప్రణాళికతో ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతోంది. దీనివల్ల గ్రీన్ గ్రిడ్‌ను నిర్మించడం కోసం అడవులను ఏమాత్రం తొలగించకుండా పనిపూర్తి చేయవచ్చని తెలుస్తోంది. సీనియర్ విద్యుత్ రంగ నిపుణుడు సద్దాఫ్ ఆలం మాట్లాడుతూ ఆధునిక టవర్ డిజైన్‌లు ఇప్పటికే పర్యావరణ అవాంతరాలను తగ్గించడంలో సహాయపడుతున్నాయని అన్నారు.

# విజయవాడ వార్త



## దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే తంగిరాల

**నందిగామ, మార్చి 18, ప్రభాతవార్త:** దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. రాష్ట్ర దివ్యాంగుల



కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉగాది కానుకగా ప్రవేశపెట్టిన దివ్యాంగ శక్తి నూతన పథకాన్ని నందిగామ ఆర్టీసీ బస్టాండ్ నందు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య బుధవారం ప్రారంభించడం జరిగినది. ఈ సందర్భంగా దివ్యాంగులనుద్దేశించి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ మాట్లాడుతూ సమాజ ప్రగతికి సమాన అవకాశాలే పునాది అన్న సంకల్పంతో దివ్యాంగులకోసం ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రోత్సహిస్తూ కూటమి నేతలతో కలిపి నందిగామ కొత్త బస్టాండ్ నుంచి కంచికచర్ల బస్టాండ్ వరకు దివ్యాంగులతో కలిసి ఆర్టీసీ బస్సులో ఎమ్మెల్యేప్రయాణం చేశారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న దివ్యాంగులతో కలిసి చేసిన ఈ ప్రయాణం వారికి మరింత ఉత్సాహాన్ని నింపింది. దివ్యాంగుల సామర్థ్యాలను గుర్తించి వారికి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా వారి రోజువారీ జీవితం సులభతరం కావడంతో పాటు, వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా దివ్యాంగుల పట్ల సమాజంలో అవగాహన పెంపొందించడంతో పాటు, వారికి మరింత గౌరవం కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకోవటం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కూటని నేతలు పాల్గొన్నారు.

## ముస్లింల పవిత్ర గ్రంథం దివ్య ఖురాన్ ఈ మాసం లోనే ఆవిర్భవించింది : సిపి రాజశేఖరబాబు

**విజయవాడ కార్పొరేషన్,మార్చి 18,ప్రభాతవార్త :** రంజాన్ పండుగకు ముఖ్య కారణం ముస్లింల పవిత్ర గ్రంథమైన దివ్య ఖురాన్ ఈ మాసం లోనే ఆవిర్భవించిందని సిపి రాజశేఖరబాబు పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్‌లో పనిచేస్తున్న ముస్లిం పోలీస్ సోదరులకు రంజాన్ పండుగను పురస్కరించుకొని బుధవారం ఎ-1 కన్వెన్షన్ సెంటర్‌లో సిపి రాజశేఖరబాబు అధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత ఉన్న రంజాన్ మాసం ప్రత్యేక ప్రార్థనలు,కఠిన రోజు(ఉపవాస దీక్షలు),దానధర్మాలు,ఆధ్యాత్మిక సందేశాలతో సాగుతుందన్నారు. కాబట్టి చాలా పవిత్రమైన రోజులు అని ఈ మాసంలో ముస్లింలు పవిత్రంగా,నిష్టగా,ఓపికతో ఉండి ఉపవాస దీక్షలు చేస్తారని, ముస్లింలందరికీ ఇఫ్తార్ విందును అందించడం ద్వారా ఇది మత సామరస్యానికి ప్రతీకగా సమాజానికి చాటి చెప్పడం జరుగుతుందన్నారు. ముస్లిం సోదరులు పోలీసు శాఖలో చాలా కీలకమైన పాత్ర పోషిస్తున్నారని,అలాగే ఇతర శాఖల్లో కూడా వారి సేవలు అమోఘమని,ముస్లిం సోదరులకు రంజాన్ సందర్భంగా రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ అందరూ సుఖ శాంతులతో ఉండాలని ముస్లిం మత పెద్దలు,పోలీసు ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో డిసిపిలు తిరుమలేశ్వరరెడ్డి,షిరీన్‌బేగం,కెజివి సరిత,కె.కృష్ణ ప్రసన్న,ఎబిటిఎస్ ఉదయరాణి,బి.లక్ష్మీనారాయణ,ఎస్‌విడి ప్రసాద్,ఏడిసిపిలు,ఏసిపిలు,సిఐలు,ముస్లిం మత పెద్దలు,పోలీసు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.




## వైకాపా నాయకులు అసత్య ఆరోపణలు చేయడం తగదు : తెదేపా నాయకలు

**కంచికచర్ల, మార్చి 18, ప్రభాతవార్త:** కంచికచర్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం కంచికచర్ల పార్టీ అధ్యక్షులు ఎఎంసి ఛైర్మన్



కోగంటి బాబు పై వైకాపా నాయకులు చేసిన అసత్య ఆరోపణలను తీవ్రంగాఖండించారు. ముఖ్యంగా దేవాదాయ భూములను కాజేయాలని చూస్తున్నారని వైకాపా నాయకులు అసత్య ఆరోపణలు చేయడం దొంగే దొంగ అన్నట్లుగా ఉందన్నారు. దేవా దయ భూములు అన్యాక్రాంతమైనట్లు రెవిన్యూ రికార్డులలో పేర్ల తారుమారు అయినట్లు వచ్చిన అసత్య కథనం పై కంచికచర్ల తహసిల్దార్ స్పందిస్తూ దేవాదయ భూములను ప్రభుత్వ రికార్డులలో ఏ విధమైన మార్పులు చేర్పులు జరగలేదని వివరణ ఇవ్వడం వంటి తదితర అంశాలను వైకానానాయకులు నిజా నిజాలను తెలుసుకొని మాట్లాడాలని కంచికచర్ల మార్కెట్ యార్డ్ నందు శనగల కొనుగోళ్లలో 310 రూపాయలుతీసుకుంటున్నారని ఆరోపణలు చేయడం సరి అయినదన్నారు. వైకాపా పరిపాలనతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభించక రైతులు ఆత్మహత్యలు చేసుకున్న విషయాలను వైకాపా నాయకులు మర్చిపోవద్దని హెచ్చరించారు. సరైన వాస్తవాలు లేకుండా మా నాయకులపై అసత్య ప్రచారాలు చేయటం మానుకుంటే మంచిదని హెచ్చరించారు. గత వైకాపా పాలనలో నియోజకవర్గంలో ఎంత అవినీతి, అక్రమ పరిపాలన జరిగిందో నియోజకవర్గ ప్రజల అందరికీ తెలుసన్నారు. వైకాపా ఐదేళ్ల పరిపాలనలో దోసుకోవటం, దాచుకోవటం మాత్రమే జరిగిందని దుయ్యబట్టారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలు 11 సీట్లు కే పరిమితమైన వైకాపాకు బుద్ధి రాలేదని ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తే రానున్న రోజుల్లో డిపాజిట్లు కూడా రాని పరిస్థితి నెలకొంటుందని టిడిపి నాయకులు ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విసయవాడ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు వేమా వెంకట్రావు, టౌన్ పార్టీ అధ్యక్షులు వేమా కిషోర్ రాష్ట్ర బీసీ కార్యదర్శి అల్లడి కోటేశ్వరరావు, విజయవాడ మైనార్టీ నాయకులు ఎండి అల్లి పాషా, పెండ్యాల పేరకలపాడు సర్పంచులు షేక్ షబ్బీర్, మన్నేసాత్విక సొసైటీ అధ్యక్షులు మోరకొండ ఏడుకొండలు, గుత్తా రత్నం, చిదిరాల భారత్ రెడ్డి , ఎంపీటీసీ సభ్యులు నన్నపనేని నరసింహారావు, ఎంపరాల వెంకటేశ్వరరావు, గుర్రం రామకృష్ణ ఏఎంసి డైరెక్టర్లు షేక్ మస్తాన్, రొంపిచర్ల శ్యాము, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు శేషం కనకరత్నం, వాసు బర్రె శంకర్రావు బర్రె, మాదాసు సురేష్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు మేడిద శ్రీనివాసరావు, దాసరి రాము, తెల్ల కోటేశ్వరరావు, బి రామకృష్ణ భానవత్ సైదులు, భాణావత్ సుధాకర్, ఒర్సు రాజేష్ నగరికంటి ఏసోబు, కొండూరు శరత్ షేక్ మున్ని, పఠాన్ బాజీఖాన్ , తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులతో విశ్వమానవ కళ్యాణం

### పీఠాధిపతి ఖాజా బాబా వెల్లడి

**ఎ కొండూరు, మార్చి 18, ప్రభాతవార్త :** ఎన్టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామంలోని ఎఎంటికె దర్బార్ బాబె ఎ బాగ్దాద్‌లో పవిత రంజాన్ నెలలో వచ్చే 5వ లైలతుల్‌ఖదర్ ఘనమైన షబేఖదర్‌ను పురస్కరించుకుని



అలుపెరుగని అన్నదాత నఖీబుల్ ఔలియా హజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ బాబా ఆధ్యాత్మి వారసుడు పీఠాధిపతి పీర్‌జాదా మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ రంజాన్ ఉపవాస దీక్షాపరులకు రోజా దారులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందుల వల్ల మానవుడిలో మానవత్వం దాతృత్వం ఉదార స్వభావం ప్రేమతత్వం పేదల్లో ఆకలిదప్పులు తెలుసుకోవడం ద్వారా నిజమైన మానవ విలువలు బహిర్గతం అవుతాయని ఖాజా బాబా తెలిపారు. ఈ ఇఫ్తార్ విందుల్లో ముస్లీం సోదరులతో పాటు హిందూ క్రైస్తవ సోదరులు సోదరీమణులు పాల్గొని రంజాన్ రోజా ఇఫ్తార్, సహారీల విందుల వల్ల ఐక్యతాభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాఫర్ సాదిఖ్ తాజ్ ఖాదర్ బాబు, బొగ్దాద్, ఖాదర్‌షా, మదని తదితరులు పాల్గొని రోజాదారులకు ఇఫ్తార్ విందు సేవలందించి బాబా సేవలో పరితపించారు. రంజాన్ నెలవంక దగ్గర నుండి నెలరోజుల పాటు ఈ ఇఫ్తార్ విందులతో ఆధ్యాత్మిక ధార్మిక శోభతో విశ్వమానవ కళ్యాణం విరాజిల్లుతోంది.

## ఆర్‌డీ ఆధారిత ప్రముఖ స్వదేశీ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్

**విజయవాడ, మార్చి 18, ప్రభాతవార్త :** ఒబెన్ ఎలక్ట్రిక్ భారతదేశంలో ఆర్‌డీ ఆధారిత ప్రముఖ స్వదేశీ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ తయారీదారు ఒబెన్ ఎలక్ట్రిక్ కంపెనీ దేశవ్యాప్తంగా విడుదల చేసిన రెండేళ్లలోపే ఒబెన్ మోటార్‌సైకిళ్ల రైడర్లు భారతీయ రహదారులపై సమిష్టిగా 3.2 కోట్ల కిలోమీటర్లకు పైగా ప్రయాణించారని ఈరోజు ప్రకటించింది. దీని ద్వారా రోజువారీ ప్రయాణానికి వినియోగదారులు తమ ప్రాథమిక ప్రయాణ ఎంపికగా ఒబెన్ మోటార్‌సైకిళ్లపై ఎంతగా ఆధారపడుతున్నారో స్పష్టమవుతోంది

## తహశీల్దార్ వైకుంఠరావుకు సన్మానం

**తిరువూరు, మార్చి 18, ప్రభాతవార్త :** ఇటీవల తిరువూరు తహసీల్దారుగా నియమితులైన వైకుంఠరావును తిరువూరు మండలం డీలర్ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసిన అసోసియేషన్ సభ్యులు తహసిల్దార్ ను దుశాలువ, పుష్పగుచ్చాలతో సన్మానించారు. కార్యక్రమంలో తిరువూరు మండల రేషన్ డీలర్స్ అసోయేషన్ సభ్యులు దుబ్బాకు సాంబయ్య, కొంగల జనార్థన్, మోదుగు ఆదాము తదితరులు పాల్గొన్నారు.



## మాన్సూన్ రెస్పాన్స్ టీం వెంటనే విధుల్లోకి చేరాలి : కమీషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,మార్చి 18,ప్రభాతవార్త** వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మాన్సూన్ రెస్పాన్స్ టీం మళ్ళీ తమ విధుల్లోకి వెంటనే హాజరుకావాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర సిబ్బందిని ఆదేశించారు. బుధవారం సాయంత్రం పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్,నిర్మలా కాన్వెంట్ రోడ్,జమ్మిచెట్టు సెంటర్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాన్సూన్ రెస్పాన్స్ టీంతో వర్షాల వల్ల కలిగే సమస్యలను పరిష్కరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.వర్షాలు కురిసినపుడు ఎక్కడైతే రోడ్లపై నీటి నిల్వలు ఉంటాయో అక్కడ రోడ్డు పైన నిల్వ ఉండకుండా చర్యలు తీసుకునేటట్లు వాహనాలు,సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా చూసుకోవాలన్నారు. నగరం లోని పునరావాస కేంద్రాలను అన్ని వసతులతో పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా జమ్మిచెట్టు సెంటర్,పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్,డివి మేనర్ రోడ్‌లలో ప్రత్యేక దృష్టి వహించాలని, వర్షం కురిసినపుడు తరచుగా అక్కడ నీటి నిలువలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి,డీసిల్టింగ్ ముందుగానే చేయించుకున్నప్పటికీ ఈ మధ్యకాలంలో ఏమన్నా వ్యర్థాలు పేరుపోయాయేమో ఒకసారి గమనించి,వెంటనే వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. జోనల్ కమీషనర్లు,అధికారులు తమ తమ పరిధిలో గల పాయింట్స్‌ని దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ,క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. నగర పరిధిలో ఎక్కడక్కడ వర్షం నిల్వలు ఉండే అవకాశాలున్నాయో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో ఎప్పటికప్పుడు వాకీటాకీలో వాటి స్థితిగతులను కనుక్కుంటూ ప్రజలు ఎటువంటి సమస్య లేకుండా నిరంతర పర్యవేక్షణతో కమీషనర్ పర్యవేక్షించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి అన్న క్యాంటీన్‌ను అధికారులు పర్యవేక్షిస్తుండాలి - కమీషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,మార్చి 18,ప్రభాతవార్త :** ప్రతి అన్న క్యాంటీన్‌ను అధికారులు పర్యవేక్షిస్తుండాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. బుధవారం ఆయన తన పర్యటనలో భాగంగా గులాబితోట అన్న క్యాంటీన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో గల అన్నా క్యాంటీన్‌లన్నింటిలోనూ ప్రజలకు ఎటువంటి సమస్య లేకుండా చేసుకుంటున్నామన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎటువంటి ఇబ్బంది ప్రజలకు కల్గకుండా చూసుకుంటున్నారన్నారు. ప్రజల అభిప్రాయాలను సేకరిస్తూ,వాటికనుగుణంగా ప్రతి అన్న క్యాంటీన్‌లో వసతులతో ఎటువంటి లోపం లేకుండా చూసుకుంటున్నారన్నారు. నిరంతర పారిశుద్ధ్య నిర్వహణలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామన్నారు.

## ఇండ్ల గణన,ఇండ్ల జాబితా తయారీ

### అదనపు కమీషనర్ సిహెచ్ వెంకటరమణ

**విజయవాడ కార్పొరేషన్,మార్చి 18,ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 2027 లోపు జరగబోయే జనభాగనన నిమిత్తం ముందస్తుగా ఇండ్ల గణన,ఇండ్ల జాబితా తయారీని చేపట్టాల్సి ఉందని,




సదరు ఇండ్ల గణన పౌరులు,గృహస్థులు స్వయంగా కేంద్ర ప్రభుత్వ వెబ్ పోర్టల్ ద్వారా 2026 ఏప్రిల్ 15 నుండి ఏప్రిల్ 30 వరకు వారి వారి గృహ సంబంధిత వివరాలను స్వీయ నమోదు చేసుకోవాలని అదనపు కమీషనర్,విజయవాడ నగరపాలక సంస్థ డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి సిహెచ్ వెంకటరమణ పేర్కొన్నారు.అనంతరం మే 1 2025 నుండి 30 మే 2026 వరకు సంబంధిత ప్రాంతాల్లో నియమించబడిన ఎన్యుమరేటర్‌లు ప్రతి ఇంటిని సందర్శించి గణన గృహాల జాబితా,సదరు గృహములందు నివసిస్తున్న సభ్యుల సంఖ్య తయారుచేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఈ రోజు అనగా మార్చి 18 2026న నగరపాలక సంస్థ కార్యాలయంలో గృహగణన బ్లాక్‌లు తయారుచేయడంపై సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## ముస్లిం స్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించండి

**కంచికచర్ల మార్చి 18 ప్రభాతవార్త:** కంచికచర్ల మైనార్టీలకు స్వశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ



విప్ తంగిరాల సౌమ్యకు మైనార్టీ సోదరులు కంచికచర్ల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ నందు వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య మైనార్టీ సోదరులతో మాట్లాడుతూ త్వరలో మీ సమస్యను తీరుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షులు ఎఎంసి ఛైర్మన్ కోగంటి బాబు, మైనార్టీ నాయకులు సలీం , కాజా, నజీర్, హలీం, జానీ, బాజీఖాన్ , మస్తాన్ తదితర మైనారిటీ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మలబార్ గ్రూప్ ఛైర్మన్‌కు మహారాష్ట్రియన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు

**అమరావతి, మార్చి 18, ప్రభాతవార్త :** ప్రపంచ ఆభరణాల రిటైల్ రంగ రూపును, సమాజాన్ని విస్తృతంగా మార్చడంలో దూరదృష్టి గల నాయకత్వం పోషించిన కీలక తోడ్పాటుకు గుర్తింపుగా మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎం.పి.అహమ్మద్, లోక్మత్ మహారాష్ట్రియన్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్స్ 2026లో ప్రతిష్టాత్మకమైన బిజినెస్ భూషణ్ అవార్డుతో సత్కరించబడ్డారు. ప్రతిష్టాత్మకమైన గేట్వే ఆఫ్ ఇండియా వద్ద జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే, లోకామత్ ఛైర్మన్ విజయ్ దర్దాతో పాటుగా మంత్రులు, అధికారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎం.పి.అహమ్మద్ మాట్లాడుతూ బాధ్యత, సమగ్రత, సమాజానికి శాశ్వత విలువను సృష్టించాలనే నిబద్ధతతో మార్గనిర్దేశం చేయబడి చేసే ప్రతి పనిలోనూ రాణించడాన్ని కొనసాగిస్తూనే వాటాదారుల సమిష్టి వృద్ధి సూత్రంపై మా ప్రయాణం ప్రారంభమైనదన్నారు.

## కంచికచర్లలో అకాల వర్షం, వడగండ్ల వాన

**కంచికచర్ల మార్చి18 ప్రభాతవార్త:** కంచికచర్ల మండలాన్ని అకాల వర్షం వణికించింది. ముఖ్యంగా వడగళ్ల వానకు జనజీవనం అస్తవ్యస్తమైంది. ఈదురు గాలులతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామం అధికారంలో మునిగింది. రహదారులు జలమయమై వాహనదారులు, దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మామిడి తోటలు, మొక్కజొన్న మిరపపంట, సెనగల రైతులు ఈ గాలి వానకు నష్టం వాటిల్లుతుంది.

# పిడుగు పాటుకు రైతు కూలి మృతి

**నగరం, మార్చి 18, ప్రభాత వార్త:** పిడుగు పడి రైతు కూలీ చనిపోయిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ధూళిపూడి గ్రామానికి చెందిన పెరవలి వనజ, వయస్సు 35 సంవత్సరాలు కూలి నిమిత్తం భట్టిప్రోలు మండలం రామారి పొలాల్లో మినుము కోతకు వెళ్లి పొలంలో పనిచేస్తుండగా అకస్మాత్తుగా పిడుగు పడి తీవ్రంగా గాయపడింది. కూలీలు వెంటనే స్పందించి ధూళిపూడి వైద్యశాలకు తరలించగా, మెరుగైన వైద్య సేవ నిమిత్తం మండల కేంద్రంలోని పీహెచ్సీ కి తీసివెళ్లారు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు, అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# బాపట్ల జిల్లా వార్త



# ఆస్తిపన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ మాఫీ సదుపాయం



**రేపల్లె, మార్చి 18, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ అధికారుల ఉత్తర్వుల ప్రకారం ఆస్తి పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ మాఫీ సదుపాయం అమలులో ఉన్నదని రేపల్లె మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు.బుధవారం ఆయన మాట్లాడుతూ రేపల్లె పట్టణంలోని ఇంటి పన్నులు,ఖాళీ స్థలాలపై పన్నులకు సంబంధించి బకాయిలను ఏక మొత్తంలో చెల్లిస్తే 50 శాతం వడ్డీ మాఫీ చేస్తామని చెప్పారు.ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే గడువుగా నిర్ణయించామని తెలిపారు.సెలవు రోజులలో ఉదయం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు పన్నుల చెల్లింపు కోసం రేపల్లె పురపాలక సంఘ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్ పనిచేస్తుందని సాంబశివరావు వెల్లడించారు.పురపాలక సంఘంలోని ప్రజలు పన్నులను పూర్తిగా చెల్లించి వడ్డీ మాఫీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్ వినోద్ కుమార్

**బాపట్ల, మార్చి 18. ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "దివ్యాంగ శక్తి పథకం ఒక చారిత్రాత్మక ముందడుగు అని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ అభివర్ణించారు. బుధవారం బాపట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఈ పథకాన్ని ఆయన వైభవంగా ప్రారంభించారు. మంగళగిరిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పథకానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో, జిల్లా



స్థాయిలో కలెక్టర్ దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ పొందుతున్న దివ్యాంగులకు, ఇకపై పూర్తి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రకటించారు.

**అర్హత:** 40 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉండి, సదరం ధ్రువీకరణ పత్రం కలిగిన వారందరూ దీనికి అర్హులు అన్నారు. బస్సు

**సర్వీసులు:** పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించ వచ్చని ఆయన తెలిపారు. ఎస్కార్ట్ సదుపాయం: దివ్యాంగుడితో పాటు వచ్చే సహాయకుడికి (ఎస్కార్ట్) టికెట్ ధరలో 50 శాతం రాయితీ లభిస్తుందన్నారు.

**ప్రీమియం సర్వీసులు:** నాన్ స్టాప్, ఇంటర్ స్టేట్, సప్తగిరి, అల్ట్రా డీలక్స్ బస్సుల్లో దివ్యాంగుడితో పాటు ఎస్కార్ట్‌కు కూడా 50 శాతం రాయితీ వర్తిస్తుంది.

బస్సులో కలెక్టర్ ముచ్చట్లు..పథకం ప్రారంభం అనంతరం, పసుపులేటి లక్ష్మీనారాయణ అనే దివ్యాంగుడిచే పచ్చజెండా ఊపించి, రిబ్బన్ కట్ చేయించి బస్సును కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులతో కలిసి బాపట్ల నుంచి జిల్లెలమూడి వరకు బస్సులో ప్రయాణించారు. ప్రయాణ సమయంలో నేరుగా దివ్యాంగుల పక్కన కూర్చుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా జీరో టికెట్‌ను లబ్ధిదారునికి అందజేశారు. మౌలిక సదుపాయాలపై ఫోకస్‌బస్సుల్లో దివ్యాంగుల కోసం ప్రత్యేక సీట్లు కేటాయించాలని, బస్టాండ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చీరాలతెనాలి మధ్య నేరుగా బస్సు సర్వీసు లేని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే బాపట్ల నుంచి బెంగళూరు, హైదరాబాద్‌కు బస్సులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రేమతో వడ్డించి.. కలిసి భుజించి..కార్యక్రమం అనంతరం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాలులో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన విందులో కలెక్టర్ పాల్గొన్నారు. అధికారులతో కలిసి దివ్యాంగుల సరసన కూర్చుని సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, ఏఓ మల్లికార్జున్ రావు, ఆర్టీసీ ఆర్ఎం సిహెచ్. విమల, ఎంపీడీఓ బాబురావు తదితరులు పాల్గొన్నారు.ప్రస్తుతం ఉన్న పాత బస్సు పాస్‌లు గడువు ముగిసే వరకు చెల్లుతాయని, కొత్త పాస్‌ల కోసం వాట్సాప్ సేవ "మన మిత్ర" ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

# దివ్యాంగ శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**రేపల్లె, మార్చి 18, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన దివ్యాంగ శక్తి పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు రేపల్లె నియోజకవర్గ తెదేపా సీనియర్ నేత అనగాని శివప్రసాద్ అన్నారు.బుధవారం రేపల్లె ఆర్టీసీ డిపోలో దివ్యాంగ శక్తి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు.బస్సులో దివ్యాంగులతో పాటు కొంత దూరం ప్రయాణించారు.ఈ సందర్భంగా డిపో ఆవరణలో జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ సహాయకులతో కలిపి రాష్ట్రంలోని 12 లక్షల 76 వేల మందికి ప్రయోజనం చేకూరేలా దివ్యాంగ శక్తి పథకం రూపుదిద్దుకుందని తెలిపారు.ఎపిఎస్ఆర్టిసి సిటీ,ఆర్డినరీ,మెట్రో ఎక్స్‌ప్రెస్,పల్లెవెలుగు,అల్ట్రా పల్లెవెలుగు,ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం దివ్యాంగులకు లభించిందన్నారు.ఆర్పిడబ్ల్యూడి చట్టం-2016 ప్రకారం 21 రకాల దివ్యాంగులలో 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వికలాంగత్వం కలిగిన వారికి ఉచిత బస్సు ప్రయాణం వర్తిస్తుందని ఆయన వివరించారు.దివ్యాంగులలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టిన దివ్యాంగ శక్తి పథకానికి ప్రయోజనం చేకూరుతుందని అనగాని



శివప్రసాద్ తెలిపారు.ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని ఆయన చెప్పారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు గురించి రేపల్లె మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు,రేపల్లె మండల తహశీల్ధార్ ఎం.శ్రీనివాసరావు,రేపల్లె ఆర్టీసీ డిపో మేనేజరు ఎ.వి.వెంకటరమణ తదితరులు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో అరుణశ్రీ దివ్యాంగుల సేవా సంఘం అధ్యక్షుడు జె.మురళి,ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# బాపట్లలో దివ్యాంగ శక్తి ప్రభంజనం!

## దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు

**బాపట్ల, మార్చి 18. ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "దివ్యాంగ శక్తి పథకం బాపట్లలో ఉత్సాహంగా ప్రారంభమైంది. స్థానిక పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఈ పథకానికి ప్రారంభించారు. తొలుత అక్కడి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, అనంతరం దివ్యాంగుల కోసం కేటాయించిన ఆర్టీసీ బస్సును పచ్చజెండా ఊపి ప్రారంభించారు.



సామాన్యుడిలా బస్సులో.. ఆప్యాయ పలకరింపుకేవలం పథకాన్ని ప్రారంభించి వదిలేయకుండా, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు స్వయంగా దివ్యాంగులతో కలిసి బస్సు ఎక్కారు. బాపట్ల నుంచి పిట్టలవానిపాలెం వరకు సామాన్య ప్రయాణికుడిలా వారి పక్కనే కూర్చుని ప్రయాణించారు. ప్రయాణ పొడవునా దివ్యాంగులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ, వారు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రభుత్వం నుంచి ఆశిస్తున్న సహాయ సహకారాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే స్వయంగా తమ పక్కన కూర్చుని సమస్యలు అడగడంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ .మంత్రి లోకేష్ మంగళగిరిలో దివ్యాంగులతో కలిసి ప్రయాణించి ఈ పథకానికి అంకురార్పణ చేశారన్నారు. వారి స్ఫూర్తితోనే బాపట్లలో ఈ కార్యక్రమం చేపట్టాం" అని తెలిపారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని కాపాడటమే కాకుండా, వారికి సామాజిక భద్రత కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. "దివ్యాంగులకు ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా నా దృష్టికి తీసుకురావచ్చు.. ప్రభుత్వం మీకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటుంది" అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బావుడాచైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాశ్ నారాయణ, పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు బాలనారాయణతో పాటు టీడీపీ, జనసేన నాయకులు, ఆర్టీసీ అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి : జిల్లా కలెక్టర్

**బాపట్ల, మార్చి 18, ప్రభాతవార్త:** జిల్లాలో గృహ నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణ సంస్థ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని న్యూ వీసీ హాల్ నుంచి



డి.పి.ఓ, హౌసింగ్ పి.డిలతో కలిసి గృహ నిర్మాణాలు, యూనిఫైడ్ సర్వే, వాట్సాప్ సేవలు, ఆస్తి పన్ను వసూళ్లపై ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

**మహిళా సంఘాల ద్వారా రుణాలు**

గృహ నిర్మాణాల్లో ఎదురవుతున్న సమస్యలను వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. గృహాలతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా డ్వాక్రా మహిళలకు రుణ సదుపాయం కల్పించడం ద్వారా పనుల్లో పురోగతి సాధించవచ్చని తెలిపారు. జిల్లాలో సుమారు 7,419 మంది మహిళలకు సంఘాల ద్వారా రుణాలు అందేలా చూడాలని గృహ నిర్మాణ శాఖ పి.డిని ఆదేశించారు.

**వాట్సాప్ సేవల వినియోగంలో టాప్3లో ఉండాలన్నారు.**

ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసే వాట్సాప్ సర్వీసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సేవల వినియోగంలో జిల్లా రాష్ట్రంలోనే మొదటి మూడు స్థానాల్లో ఉండాలన్నారు.అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వాట్సాప్ సేవలపై పోస్టర్లు ప్రదర్శించాలనీ సూచించారు.

**యూనిఫైడ్ సర్వే:** ప్రతి మండలం పరిధిలో రోజుకు కనీసం 1,000 కుటుంబాల సర్వే పూర్తి చేయాలన్నారు.

ఆస్తి, ఇంటి పన్నుల వసూళ్లపై పట్టు వదలకూడదని, ప్రతి మండలంలో రోజుకు రూ. 4 లక్షల వసూలే లక్ష్యంగా పని చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఎల్. ప్రభాకర్ రావు, హౌసింగ్ పి.డి వెంకటేశ్వరరావు, డి.ఆర్.డి.ఏ పీడీ విజయలక్ష్మి, సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు సకాలంలో తగిన సేవలను అందించాలి

## జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల

**చెరుకుపల్లి, మార్చి 18, ప్రభాతవార్త :** ఆర్ఎస్కే కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు ప్రతి సర్వీసును నిబంధనల ప్రకారం రైతులకు సకాలంలో అందించాలని జిల్లా వ్యవసాయ అధికారినణి ఎం విజయనిర్మల అన్నారు. రాష్ట్ర మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో పప్పు ధాన్యాల కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలకు ఎఫ్ఏ క్యూ మరియు కొనుగోలు కేంద్రాల నిర్వహణపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆరంబాక ఆర్ఎస్కే లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి మార్క్ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కరుణశ్రీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ రైతులు ఈసి ఎం ఎ పి పి పోర్టల్



ద్వారా మరియు ఆధార్ లింకుతో నమోదు చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు సరిగ్గా పని చేసే విధంగా చూసుకోవాలన్నారు. రైతుల వద్ద నుంచి సేకరించే అపరాలు సెనగకు 14 కంది, మినుము ,పెసలకు 12 శాతం వరకు అనుమతించాలని సిబ్బందికి సూచించారు. రైతుల వద్ద నుండి అపరాలకు కొన్న వెంటనే తగిన రసీదు అందజేయాలన్నారు. రైతులకు నగదు చెల్లింపులు బ్యాంకు ఖాతాలకుదీటీగి ద్వారా సమయానికి జమ చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో శుభ్రత ,నిల్వ, భద్రతా చర్యలు పాటించాలన్నారు. అపరాలు కొనుగోలు తాలూకు స్టాక్ రిజిస్టర్ ,వివరాలను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఏర్పడితే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలి అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర ప్రయోజనం సక్రమంగా అందేలా కేంద్రాలు పని చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులకు తగిన సేవలు అందించడంలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. శిక్షణ కార్యక్రమంలో రేపల్లె మార్కెట్ యార్డ్ చైర్మన్ మత్తి అనురాధ భాస్కరరావు, ఏ డి ఏ లక్ష్మి మ, ఏవో ఫరూక్, కావూరు గూడవల్లి పిఏసిఎస్ చైర్మన్లు మండవ తాతాజీ, సురేంద్రబాబు, సనకా శ్రీనివాసరావు, రవి కిరణ్, సంఘాల సీఈఓ లు, సాంకేతిక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల జీవితం షడ్రుచుల సమ్మేళనం

## జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్

**బాపట్ల, మార్చి 18, ప్రభాతవార్త:** తెలుగు నూతన సంవత్సరం శ్రీ పరాభవఖి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని బాపట్ల జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి మరియు మీడియా మిత్రులకు జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో జిల్లాలోని ప్రతి ఇంటా సుఖ శాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. విధుల పట్ల అంకితభావం అభినంద నీయంఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పండుగ వేళల్లో తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ,



ప్రజల రక్షణే ధ్యేయంగా అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. "తీపి, పులుపు, చేదు వంటి షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి లాగే పోలీసుల జీవితం కూడా ఉంటుం అన్నారు. పని ఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆరోగ్య ఇబ్బందులు ఎదురైనా.. వాటన్నింటినీ ధైర్యంగా, సమయస్ఫూర్తితో అధిగమించినప్పుడే నిజమైన విజయం లభిస్తుందన్నారు. శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలిసమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తూ, పోలీస్ శాఖకు, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తున్న మీడియా మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. పండుగను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఆనందోత్సాహాల మధ్య శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ప్రజలను ఎస్పీ కోరారు.

# 23నుడి25 వరకు బూరుగులమ్మ మహాకుంభాభిషేక మహోత్సవం

**రేపల్లె, మార్చి 18, ప్రభాతవార్త:** రేపల్లె పట్టణంలోని బూరుగులమ్మ గ్రామదేవత దేవాలయంలో ఈ నెల 23వ తేదీ నుండి 25వ తేదీ వరకు మహాకుంభాభిషేక మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు అర్చకస్వామి ఎన్.భానుసుధాకర్ తెలిపారు.బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ దేవాలయంలో 12 సంవత్సరాలకోసారి మహాకుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.శాస్త్రోక్తంగా విశేష పూజలు,హోమాలు, అభిషేకాలు,అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.



# ముస్లిం సోదరులకు వైకాపా రంజాన్ తోఫా అందజేత

**రేపల్లె, మార్చి 18, ప్రభాతవార్త:** వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ ఆదేశాల ప్రకారం స్థానిక వైకాపా నాయకుల బృందం బుధవారం రేపల్లె టౌన్,మండలంలోని బేతపూడి మసీదుల పరిధిలోని ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా అందజేశారు.



లడ్డూలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖుద్దూష్,ఖాదర్, భాషా,షేక్ సలీం,గోరా,హుదూద్,కాలేషా,డాక్టర్ అతిక్,షేక్ గౌస్,వైకాపా రేపల్లె పట్టణ కన్వీనర్ కె.శేషగిరిరావు,వైకాపా రాష్ట్ర సహాయ కార్యదర్శులు చిమటా బాలాజీ,చిత్రాల ఒబేదు,రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి కె.వెంకటకృష్ణారెడ్డి,జిల్లా క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు ప్రభు కిరణ్,దాసరి సందీప్,సాగర్,ఆలూరు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ముస్లిం మహిళలకు చీరల పంపిణీ

**రేపల్లె, మార్చి 18, ప్రభాతవార్త:** రంజాన్ ఉపవాసంతో అల్లాను ఆరాధించే ముస్లిం సోదరులు అభినందనీయులని అనగాని అభిమాన సంఘం నేత కొండపల్లి



వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పురపాలక సంఘంలోని ముస్లిం మహిళలకు చీరలను పంపిణీ చేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొండపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్,రేపల్లె నియోజకవర్గ తెదేపా సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్‌ల సూచన ప్రకారం ముస్లిం మహిళలకు చీరలు ఇచ్చే కార్యక్రమం చేపట్టామని చెప్పారు.రంజాన్ అనేది అరబిక్ భాషలో 9వ నెల అయిన మార్చిలో ఖరాన్ ఆవిర్భవించింద న్నారు. రంజాన్ మాసం వచ్చిందంటే ప్రపంచంలోని ముస్లింలంతా తెల్లవారుజామున 4 గంటలకు భోజనం చేసి దీక్షను ప్రారంభించి నీరు కూడా తాగకుండా సాయంత్రం 4 గంటల వరకు దీక్ష కొనసాగించడం విశేషమన్నారు. పేద ప్రజలకు దానధర్మాలు చేయడం వలన పుణ్యం ప్రాప్తిస్తుందని వెంకటేశ్వరరావు తెలిపారు. ఉత్తమ భావనలతో అల్లాను ఆరాధించడంతో మనసు ప్రశాంతత, ఉపవాసాల వలన ఆరోగ్యం చేకూరుతుందని ముస్లింలు విశ్వసిస్తుంటారని ఆయన చెప్పారు.సకల జీవరాశి ఎటువంటి సమస్యలు లేకుండా ఉల్లాసంగా ఉండాలని ముస్లిం సోదరులు ప్రార్థనలు చేయడం అభినంద నీయమన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ కరీముల్లా,కాగిత శ్రీనివాస రావు,నల్లూరు అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు మున్సిపల్ పాలకవర్గానికి సత్కారం

**రేపల్లె, మార్చి 18, ప్రభాతవార్త:** రేపల్లె పురపాలక సంఘంలో ఐదు సంవత్సరాలు ప్రజాసేవ చేసిన మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్లు,కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులను గురువారం ఉదయం 10 గంటలకు సన్మానిస్తామని ప్రముఖ వ్యాపారవేత్త,రాజకీయవేత్త మోపిదేవి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు.మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం పూర్తయిన సందర్భంగా వారి సేవలకు గుర్తింపుగా ఉగాది,రంజాన్ పర్వదినాల సందర్భంగా అభినందించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

# ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని కలుషితం చేయరాదు

**నిజాంపట్నం, మార్చి 18, ప్రభాతవార్త:** ప్రశాంతంగా ఉన్న రేపల్లె నియోజకవర్గంలో అలజడులు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తే సరైన సమయంలో తగిన బుద్ధి చెప్పారని జడ్పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య అన్నారు. బుధవారం ఆయన స్వగృహంలో



ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేపల్లెలో ఫ్లెక్సీల విషయంలో ఏర్పడిన వివాదాన్ని మున్సిపల్ అధికారులతో సంప్రదించి పరిష్కరించుకోవాల్సి ఉండగా తెదేపా నాయకుల ఫ్లెక్సీలు చింపటం దారుణమనా న్నరు. ప్రజలు అన్నీ చూస్తూ ఉంటారని ఎవరేంటో తెలుసుకుంటారనా న్నరు. రేపల్లె నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆయన సోదరుడు శివప్రసాద్ అహర్నిశలూ కృషి చేస్తున్నారని ఆయన తెలియజేశారు. అధిక నిధులు తీసుకువస్తూ పనలు చేయిస్తున్నారన్నారు. వైకాపా నాయకులు రౌడీయిజానికి నాంది పలుకుతున్నారని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో నిజాంపట్నం పిఏసిఎస్ అధ్యక్షుడు మైలా నరేష్ , తెదేపా నాయకులు ఖాదర్‌బాబు, నక్కల పోలిరాజు, నర్రా వెంకటేశ్వరరావు, సునీల్, కేసన మోహనరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

**రేపల్లె,మార్చి 18, ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ




మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు, రేపల్లె నియోజకవర్గ తెదేపా సీనియర్ నేత అనగాని శివప్రసాద్ చెప్పారు.బుధవారం మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల ప్రకారం పట్టణంలోని ఆంధ్రరత్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అనగాని శివప్రసాద్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం తయారు చేసే వంటశాల పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు.మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నందున ప్రతి ఒక్కరూ బాధ్యాతయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.విద్యార్థులకు పోషక విలువలు అందేలా ఆహారాన్ని వండాలన్నారు.విద్యార్థులతో పాటు అనగాని శివప్రసాద్ భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రం,డొక్కు శ్రీనివాసరావు,దేవగిరి రవిశంకర్,పంతాని సాయికుమార్,కొలసాని రాము తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవు

**నగరం, మార్చి 18, ప్రభాతవార్త:** అక్రమ మద్యం అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ శ్రీరామ్ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం పాలసీ అమల్లోకి వచ్చినప్పటి నుండి నగరం, చెరుకుపల్లి ,నిజాంపట్నం మండలాల్లో సుమారు 151 కేసును నమోదు చేసామని తెలిపారు. 3 మండలాల్లో 79 కేసులు నమోదు చేసి 79 మందిని అరెస్టు చేసి 685 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిజాంపట్నం మండలంలో మూడు డిఫెన్స్ లిక్కర్ కేసులు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేసి 30 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని, నిజాంపట్నం మండలంలో నాటు సారా ప్రభావిత ప్రాంతాల్లో ఆరు లిక్కర్ కేసు నమోదు చేసి,36.5 లీటర్ల లిక్కర్ న స్వాధీనం చేసుకుని , ఆరుగురుకి రిమాండ్ పంపించామని, నాటు సారా తయారీకి ఉపయోగించే 92000 లీటర్ల బెల్లం ఊటని ధ్వంసం చేయడమైనదని, నాటు సారా అరికట్టేందుకు నిజాంపట్నం మండలంలో అనుమానిత ప్రదేశాల్లో నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. కల్తీ కల్లు నివారించుటకు103 కల్లు శాంపిల్స్ తీసి రసాయన పరీక్షలు పంపించడం జరిగిందని, కల్తీ మద్యం అమ్మకాలు నివారించుటకు 45 మద్యం దుకాణాల నుండి శాంపిల్స్ తీసి రసాయన పరీక్ష పంపించడం జరిగిందని తెలిపారు.74 మందిని 128/129 బి ఎన్ ఎస్ ఎస్ చేయడం జరిగింది అన్నారు.

# జవహర్ నవోదయకు భట్టిప్రోలు విద్యార్థులు

**భట్టిప్రోలు(రేపల్లె), మార్చి 18, ప్రభాతవార్త :** భట్టిప్రోలుకు చెందిన ఇరువురు విద్యార్థులు జవహర్ నవోదయ పరీక్షలలో అద్భుత ప్రతిభను చూపారు.జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాలలో భట్టిప్రోలు రామారావు ఎంపిపి పాఠశాల విద్యార్థిని దీపాల నాగిని సాయి 100 మార్కులకు 87.5 మార్కులు సాధించి 82వ ర్యాంకును కైవసం చేసుకుంది.భట్టిప్రోలు విశ్వశాంతి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థి మోకా హర్షిత్ 100 మార్కులకు 83.75 మార్కులు సాధించి 169 ర్యాంకును కైవసం చేసుకున్నాడు.ఉత్తమ ర్యాంకులు సాధించిన నాగిని సాయి,హర్షిత్‌లను ప్రధానోపాధ్యాయుడు షేక్ హుస్సేన్,కరస్పాండెంట్ ఎంపి వెంకట్రావు,ఉపాధ్యాయులు అభినందించారు.



# పల్నాడు జిల్లా వార్త



## దివ్యాంగుల ఉచిత బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే

**మాచర్ల, మార్చి 18 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని దివ్యాంగుల ఆత్మనిబ్బరతకు దివ్యాంగశక్తి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన దివ్యాంగ శక్తి పథకాన్ని స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా ఆర్టీసీ బస్సుకు పూజలు నిర్వహించి, జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బస్సులో ప్రయాణిస్తున్న దివ్యాంగులకు కండక్టర్‌తో టికెట్ కొట్టించి అందజేశారు. మాచర్ల నుంచి వెల్దుర్తి వరకు బస్సులో ప్రయాణించారు. గతేడాది అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు ఇంద్రధనస్సు పేరిట దివ్యాంగులకు ఆరు వరాలను ప్రకటించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఉగాది కానుకగా దివ్యాంగ శక్తి పథకాన్ని అమలు చేసి, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తున్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

**నరసరావుపేట టౌన్, మార్చి 18 ప్రభాతవార్త :** దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయంగా పెట్టుకుని పనిచేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన దివ్యాంగ శక్తి పథకంను బుధవారం నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. కార్యక్రమానికి డిపో మేనేజర్ బి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మున్సిపల్ కమిషనర్ రవికుమార్, పట్టణ ప్రముఖులు కపిల విజయ్ కుమార్, దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కర్లాటి కృష్ణమూర్తి, ఆర్టీసీ అధికారులు ప్రసాద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగుల ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రతే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. దివ్యాంగుల ముఖాల్లో చిరునవ్వును చూడడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం ఎప్పుడూ దివ్యాంగుల వెంటే ఉంటుందని, ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే అరవింద్ బాబు ఉచిత ప్రయాణ పాసులను దివ్యాంగులకు అందజేసి వారితో కలిసి రావిపాడు గ్రామం వరకు ప్రయాణించారు. ఎమ్మెల్యే వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వినుకొండలో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించిన జీవీ

**వినుకొండ,మార్చి18,ప్రభాతవార్త:** దివ్యాంగుల సంక్షేమాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఉగాది కానుకగా దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందని చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన దివ్యాంగ శక్తి కార్యక్రమానికి జీ.వీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను మాత్రమే కాకుండా,ఇప్పటివరకు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చే విధంగా కృషి చేస్తుందన్నారు. ఉగాది కానుకగా ప్రారంభమైన దివ్యాంగ శక్తి పథకం ద్వారా సుమారు 12.76 లక్షల మంది దివ్యాంగులు వారి సహాయకులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించ గలుగుతారని తెలిపారు. ప్రతి సంవత్సరం ఈ ప్రయాణానికి రూ. 207 కోట్ల సబ్సిడీ భారం ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 3000 రూపాయలుగా ఉన్న దివ్యాంగుల పెన్షన్‌ను రూ. 6,000కు పెంచడం, పూర్తిస్థాయి వైకల్యంతో బాధపడుతున్నవారికి నెలకు రూ. 15,000 పెన్షన్ అందించడం గొప్ప విషయమన్నారు. వైద్య సేవలు,ఉద్యోగాలు,ఇతర అవసరాల కోసం సులభంగా,ఉచితంగా రాకపోకలు కల్పించడం వంటి చర్యలు దివ్యాంగుల స్వావలంభనకు దోహదపడతా యన్నారు. అనంతరం జీవి దివ్యాంగులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయానికి దివ్యాంగులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. చీఫ్‌విప్ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అధికారులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## ప్రేమ విఫలమై యువతి ఆత్మహత్య

**మాచర్ల, మార్చి 18 ప్రభాతవార్త:** ప్రేమ విఫలమై యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మాచర్లలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మాచర్ల పట్టణానికి చెందిన కామనబోయిన చౌడమ్మ, జమ్మలమడక గ్రామానికి చెందిన గంగనబోయిన నాగరాజుతో ప్రేమలో ఉన్నట్లు సమాచారం. పెద్దలు అంగీకరించరనే భయంతో ఇద్దరూ ఇంటి నుంచి వెళ్లిపోయారు. చౌడమ్మ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించడం లేదని ఆరోపిస్తూ వారం రోజుల క్రితం తల్లిదండ్రులు పోలీసు స్టేషన్ ముందు పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అక్కడికి చేరుకున్న డీఎస్పీ, ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి అమ్మాయిని తీసుకువస్తామని హామీ ఇవ్వడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. నాలుగు రోజులక్రితం పోలీసులు పోలీసులు చౌడమ్మను స్టేషన్‌కు తీసుకువచ్చి పెద్దల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. ప్రేమించిన వ్యక్తి దూరమవడంతో మనస్తాపానికి గురైన చౌడమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మాచర్లలో తీవ్ర కలకలం రేపింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## మాచర్లలో కార్డెన్ సెర్చ్

**మాచర్ల, మార్చి 18 ప్రభాతవార్త:** స్థానిక రోప్‌లైన్ కాలనీ, 8వ వార్డులో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన కార్డెన్ సెర్చ్‌లో అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులను, వస్తువులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 33 మోటారు సైకిళ్లు, రెండు ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గడ్డపారలు, గొడ్డళ్లు వంటి ప్రమాదకర వస్తువులను గుర్తించారు. కాలనీలో పలు ఇళ్లను సోదా చేసి, అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించారు. అనంతరం స్థానికులకు గంజాయి, మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాన్ని వివరించారు. ఎవరైనా చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. కార్డెన్ సెర్చ్‌లో కారంపూడి సీఐ శరత్‌బాబు, ఎస్సై సంధ్యారాణి, టౌన్ ఎస్సై వెంకట్రావు, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## రైతన్నా మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్న చీఫ్‌విప్ జీవీ

**బొల్లాపల్లి,మార్చి18,ప్రభాతవార్త:** మండలంలో వెల్లటూరు గ్రామంలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు పాల్గొన్నారు. స్వయంగా గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి రైతులతో ముఖాముఖిగా మాట్లాడి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం సాగు పంటలను పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ,పీఎం కిసాన్ పథకాల గురించి రైతులకు వివరించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు,వ్యవసాయ శాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు.



## పేకాట ఆడుతున్న 16 మంది అరెస్టు

### రూ.3.40 లక్షలు స్వాధీనం

**నరసరావుపేట క్రైమ్,మార్చి 18, ప్రభాతవార్త :** రొంపిచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని రొంపిచర్ల కర్లకుంట గ్రామాల మధ్య గల మొక్కజొన్న పొలాలలో పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు బుధవారం తెల్లవారు జాము సమయంలో దాడులు నిర్వహించినట్లు రొంపిచర్ల ఎస్ఐ ఎల్.లోకేశ్వరరావు తెలిపారు. దాడులలో పేకాట ఆడుచున్న 16 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి 3,40,100 నగదు స్వాధీనం చేసుకోవడం జరిగింది. రొంపిచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై ఎస్పీ కృష్ణారావు ఉత్తర్వుల మేరకు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ లోకేశ్వరరావు హెచ్చరించారు . చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై సమాచారం అందించే వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

## రైతులు సంక్షేమానికి ఉమ్మడి కూటమి ప్రభుత్వం పెద్ద పీట : ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, మార్చి 18 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు బుధవారం పమిడిపాడు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా



గ్రామంలో ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన రైతన్న మీకోసం మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించారు. ప్రజలతో మమేకమై, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రైతులు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నా రు. ఎక్కడా లేని విధంగా సంవత్సరం 20,000 రూపాయలు ఆర్థిక సాయం ప్రతి రైతుకి అందుతున్నాయని ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రైతన్న ని ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఎప్పుడు మర్చిపోలేదన్నారు.వారిని ఆర్థికంగా పైకి తీసుకురావాలని ఆర్టికల్చర్ సెర్రీ కల్చర్, సేంద్రీయ వ్యవసాయం అవగాహన సబ్సిడీ పైన పనిముట్లు. ట్రాక్టర్లు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి పశువైద్యశాఖ ఏడి, వైద్య సిబ్బంది, అగ్రికల్చర్ అధికారులు, పార్టీ సీనియర్ నాయకులు కపల విజయకుమార్,వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పునాటి శ్రీనివాసరావు, ఉమ్మడి కూటమి నాయకులు,రైతులు కార్యకర్తలు పాల్గొన్నారు

## కిల్కారి సేవలు పైన అవగాహన

**యడ్లపాడు, మార్చి 18, ప్రభాతవార్త :** యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఉప్పరపాలెం గ్రామంలో జరుగుతున్న ఇమ్యూనైజషన్ సెషన్ ని కిల్కారి రీజినల్



ప్రోగ్రాం ఆఫీసర్ రాజు బుధవారం సందర్శించారు. గర్భిణీ, బాలింతలకు కిల్కారి కాల్స్ పైన అవగాహన కల్పించడం జరిగినది. మాతా శిశు మరణాలు తగ్గించాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కిల్కారి సేవలను గర్భిణీ, బాలింతలకు ప్రవేశ పెట్టారు. ఈ కిల్కారి కాల్ ద్వారా తల్లీ మరియు బిడ్డల యొక్క ఆరోగ్య సమాచారం అందిచబడుతుంది. ఈ కిల్కారి కాల్స్ గర్భిణీ 4వ నెల మొదలుకొని పుట్టిన బిడ్డ సంవత్సరం వరకు వస్తాయన్నారు. ఈ కిల్కారి వాయిస్ కాల్స్ నెలకు ఒక సారి గర్భిణీ, బాలింతల యొక్క మొబైల్స్‌కి వస్తాయని, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి కాల్ నెంబర్ 911600403660 అని, ఈ కాల్ నెంబర్ ని గర్భిణీలు మరియు బాలింతలు వాళ్ళ మొబైల్ లో సేవ్ చేసుకున్నట్లు అయితే కాల్ వచ్చినపుడు తీసి పూర్తిగా సమాచారాన్ని వినగలుగుతారన్నారు. ఒక వేళ మరలా తిరిగి ఆ సమాచారాన్ని వినాలి అంటే 14423 అనే టోల్ ఫ్రీ నెంబర్ కి చేసి వినవచ్చునాన్నరు. ఈ విధంగా సరైన సమయం సరైన సమాచారాన్ని విని పాటించటం ద్వారా తల్లీ బిడ్డలు ఆరోగ్యం గా ఉంటారు. ఈ కిల్కారి సేవలను గర్భిణీలు, బాలింతలు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌వో శివనాగ లక్ష్మి, ఎఎన్ఎమ్ విజయకుమారి మరియు ఆషాలు సామ్రాజ్యం, మస్తానీ పాల్గొన్నారు.

## నవోదయ సీటు సాధించిన పమిడిమర్రు విద్యార్థిని

**నరసరావుపేట, మార్చి 18 ప్రభాతవార్త :** నరసరావుపేట మండలంలో ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని నవోదయాలో సీటు సాధించారు. వివరాలను బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరెడ్డి తెలియజేశారు.పమిడిమర్రు ఎస్.సి.కాలని ప్రాథమిక పాఠశాల నుండి గర్నెపూడి హదస 202627 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాల నందు సీటు సాధించినదన్నారు.ఈ సందర్భంగా గర్నెపూడి హదసను ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు అభినందించారు. అదేవిధంగా పాఠశాల హెచ్.యం ధనలక్ష్మి, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి మండల విద్యాశాఖాధికారి వారిని స్థానిక మండల వనరుల కేంద్రంలో కలవటం జరిగినది. యం.ఇ.ఓ వి.ఎసుబాబు సీటు సాధించిన హదసను, పాఠశాల ఉపాధ్యాయులను, సిబ్బందిని మరియు తల్లిదండ్రులను అభినందించారు.



## నవోదయ ఫలితాల్లో శ్రీ విజేత కాన్సెప్ట్ స్కూల్ విజయదుందుభి

**వినుకొండ,మార్చి18,ప్రభాతవార్త:** నవోదయ ఫలితాల్లో పట్టణంలోని శ్రీ విజేత కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. మొత్తం సీట్లు సాధించినట్లు స్కూల్ డైరెక్టర్లు కావూరి సాయికుమార్, బ్రహ్మయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులు ఎస్.రాజకుమార్,కె.నరసింహ, ఎం.శైవిజ్ఞా, ఎస్.లిఖిత,కె.అశ్విత్,ఎం.అంజిని,శ్రీనివాస్, డి.సుదర్శన్ ,జె.అశ్రిత, జి.హర్షవర్ధన్‌లకు అభినందనలు తెలియజేశారు.




## పదవులు19 మంది జనసైనికులకే దక్కాయి

**నరసరావుపేట టౌన్, మార్చి 18 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీ లబ్ధిదారులు అంటూ ఇటీవల నియోజకవర్గ టీడీపి నాయకులు విడుదల చేసిన 50 మంది పదవులు పొందిన లబ్ధిదారులలో కేవలం 19 మంది మాత్రమే జనసేన పార్టీ వారని అధికార ప్రతినిధి షేక్. అధ్రుఫ్ అన్నారు.బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. అందులోని మిగతా లబ్ధిదారులు టీడీపి, బిజెపి, వైసిపిలకు చెందిన నాయకులా, లేక ప్రజా సంఘాల నాయకులో టీడీపి వారే సమాధానం చెప్పాలన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో రేషన్ డీలర్స్, వివిధ ప్రభుత్వ సంస్థల్లో డైరెక్టర్, యానిమేటర్స్ తదితర 1607 పోస్టులు ఉంటే, జనసేన పార్టీ శ్రేణులకు కేవలం 19 పోస్టులు మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అయినా ఇంతవరకు జనసేన పార్టీ కార్యకర్తలకు ఎటువంటి న్యాయము జరగలేదని అన్నారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలకు పదవులను కల్పించాలని ఎమ్మెల్యే ని కోరుకుంటున్నామని కోరారు. సమావేశంలో నాయకులు మల్లెపూల దుర్గాకుమారి, ఆర్కే. యాదవ్, కృష్ణంశెట్టి ఏడుకొండలు, చెన్నుపల్లి సాంబ, షేక్. బాషా, జడా శ్రావణి, రేణుక, నిర్మల పాల్గొన్నారు.



## రైతన్నా మీ కోసం ఇంటింటి ప్రచారం

**నూజెండ్ల,మార్చి18,ప్రభాతవార్త:** రైతన్నా మీ కోసం వారోత్సవాల్లో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ సంక్షేమ పథకాలతో పాటు ఐదు ముఖ్య సూత్రాలను తెలియజేసి సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన ప్రచార పత్రికలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అంజనేయులునాయక్,వ్యవసాయ శాఖ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.



## వైభవంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**సత్తెనపల్లి మార్చి 18 ప్రభాతవార్త:** పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం బుధవారం నిర్వహించారు. ఉగాదిని పురస్కరించుకొని ఆలయ శుద్ధి చేపట్టారు. వేకువఝుమున సుప్రభాతం, అర్చన సేవల అనంతరం శ్రీవారి మూల మూర్తికి



ఆలయ ప్రధాన అర్చకులైన శ్రీమాన్ శ్రీ చిత్రకవి శ్యాము ఆచార్య రామానుజ స్వామి పట్టు వస్త్రంతో పూర్తిగా కప్పివేశారు. సుగంధ ద్రావ్యాలు కలిపిన ప్రవిత్ర జలంతో ప్రదీక్షణగా వెళ్లి.. ఆలయ శుద్ధి చేపట్టారు. ఆలయ శుద్ధి అనంతరం స్వామి వారిపై కప్పిన వస్త్రం తొలగించి, ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పించారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజన కార్యక్రమానికి, నారాయణసేన నగర సంకీర్తన బృందం, కోలాట మహిళ భక్త బృందం, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు. అర్చకులు వారికీ శ్రీవారి మంగళశాసనలు అందజేశారు.

## ముస్లిం మైనార్టీ న్యాయవాదుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

**వినుకొండ,మార్చి18,ప్రభాతవార్త:** రంజాన్ మాసం పురస్కరింకొని ముస్లిం మైనార్టీ న్యాయవాదుల ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ భవనం నందు ఇఫ్తార్ విందు



కార్యక్రమం ఏర్పాటు చేశారు. వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎం.మహతి కార్యక్రమంలో పాల్గొని అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మీసాల శ్రీనివాసరావు,సెక్రటరీ పఠాన్ గౌస్ మొహిద్దిన్ ఖాన్,వైస్ ప్రెసిడెంట్ పివి రమణారెడ్డి,జాయింట్ సెక్రెటరీ ఎన్ శేఖర్ బాబు,ట్రెజరర్ వి శివశంకర్ బాబు,ఏజీపీ ముప్పాళ్ళ జ్ఞానేశ్వరావు,ఏపీపీ దండే వెంకటేశ్వర్లు,సయ్యద్ ఖాసిం,సిహెచ్ అస్మతుల్లా,జే ఎస్ కే నాగూర్,ఎస్ అబ్దుల్ హాఫీస్,సీనియర్ న్యాయవాదులు పి జే లుకా,సిహెచ్ వెంకీ రెడ్డి,ఎన్ రామకోటేశ్వరరావు,పి సైదారావు,టి హనుమంతరావు,మూర్తి,ఎంఎన్ ప్రసాద్,సి వీరాంజనేయులు,ఎమ్ సామ్రాజ్యం,నాగ పద్మ,మాధవి తదితర సీనియర్,జూనియర్ న్యాయవాదులు,కోర్టు సిబ్బంది,పోలీసులు,గుమస్తాలు పాల్గొన్నారు.

## అచ్చంపేట పీహెచ్‌సీలో 3గ్గురు ఆశా కార్యకర్తలకు నియామక పత్రాల అందజేత

**అచ్చంపేట, మార్చి 18,(ప్రభాతవార్త):** అచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టులకు నియామక పత్రాలు బుధవారం అందజేశారు. అచ్చంపేట1, పెదపాలెం, కోగంటివారి పాలెం సబ్ సెంటర్లకు చెందిన ముగ్గురు అభ్యర్థులకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి. రవి మంజూరు చేసిన నియామక పత్రాలను పీహెచ్‌సీ వైద్యాధికారి డా. వి. రాంబాబు నాయక్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అచ్చంపేట1 సబ్ సెంటర్‌కు సందెపోగు ఇందిర, పెదపాలెం సబ్ సెంటర్‌కు సుంకర ఆదిలక్ష్మి, కోగంటివారి పాలెం సబ్ సెంటర్‌కు గడ్డం శ్రీలక్ష్మి నియామక పత్రాలు పొందారు. కొత్తగా నియమితులైన ఆశా కార్యకర్తలు తమకు కేటాయించిన గ్రామాల్లో సుమారు వెయ్యి మంది ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో మాతాశిశు సంరక్షణ సేవలు, ఆరోగ్య కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించాలని వైద్యాధికారి డా. వి. రాంబాబు నాయక్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పి. వెంకటరావు, హెల్త్ ఎడ్యుకేటర్ కె. పార్వతి, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## నేడు పునీత జోజప్ప పండుగ

**పెదకూరపాడు,మార్చి 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని జలాలపురం గ్రామంలో గురువారం పునీత జోజప్ప తిరుణాల మహోత్సవం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఉదయాన్నే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు వారన్నారు. క్రైస్తవ భక్తులు పునీత జోజప్ప పండుగ మహోత్సవంలో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరారు.



## స్పోర్ట్స్ మీట్‌లో ఎంఏఎం విద్యార్థినుల ప్రతిభ

**నకరికల్లు,మార్చి 18 ప్రభాతవార్త :** మలినేని లక్ష్మయ్యఇంజనీరింగ్ కాలేజ్ లో ఈనెల 13,.14 తేదీలలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్లో ఎం ఏ కళాశాల విద్యార్థినిలు మంచి ప్రతిభ చూపారు. మలినేని విద్యాసంస్థలలో నిర్వహించినటువంటి సంస్కృతి ఏ నేషనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్లో కేసనుపల్లి మేదరమెట్ల అంజమ్మ మస్తాన్ రావు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు రాణించారు.టెన్నికాయిట్ విభాగంలో సెకండ్ ప్లేస్ సాధించారని కళాశాల డైరెక్టర్ దరువురి శ్రావ్య పృథ్విరాజ్ గారు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రామ శేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా రాణిస్తున్నారని విద్యార్థులును అభినందించారు ఎస్. గౌరీ బి. శిరీష ను, ఫిజికల్ డైరెక్టర్ కె. సన్నీ డేనియల్ ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రామారావు అధ్యాపకులు అధ్యాపక సిబ్బంది అభినందించారు.



